క్లుప్తంగా

మద్దతు ధర ప్రకటించాలి

కురుపాం: జీడిపిక్కల కొనుగోలుకు మద్దతు ధర ప్రకటించి, కొనుగోలు చేయాలని గిరిజన సహకార సంస్థను గిరిజన రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో జీడిపిక్కల ధర రూ.108 ఉందని, గతేడాది ఇదే సమయానికి వీటి ధర కిలో రూ.115 ఉండేదన్నారు. ఏటా నిత్యవసరాల ధరలు పెరుగుతున్నాయి కానీ పంట ధర మాత్రం పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి, మద్దతు ప్రకటన వచ్చేలా చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

లివిరిలో శిలువయాత్ర



శిలువ యాత్రలో పాల్గొన్న దీక్షాపరులు

భామిని: మండలంలోని లివిరిలో పరిశుద్ధ బహిరంగ శిలువ యాత్రను క్రైస్తవ దీక్షాపరులు గురువారం నిర్వహించారు. చర్చ్ ఫాదర్ థామస్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు విశ్వాసకులు యాత్రలో పాల్గొని భటులు ప్రభువును హింసిస్తున్న సంఘటనను ప్రదర్శించారు. కార్యక్రమంలో భామిని, బత్తిలి, లివిరి, తదితర ప్రాంతాలకు చెందిన విశ్వాసకులు, దీక్షాపరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు



ఉల్లిభద్రలో ఎన్నికల కోడ్ అమలును పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో సూర్యనారాయణ

గరుగుబిల్లి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విడుదల చేసిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో పి.సూర్యనారాయణ అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని ఉల్లిభద్ర గ్రామంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పించారు. ఎన్నికల కోడ్ దృష్ట్యా ఎక్కడా రాజకీయ ప్రచార చిత్రాలు, బ్యానర్లు, పోస్టర్లు, హోర్డింగ్‌లు ఉండకూడదన్నారు. ఎక్కడైనా అటువంటివి ఉంటే వాటిని వెంటనే తొలగించాలన్నారు. ప్రతిఒక్కరూ ఎన్నికల కోడ్ పాటించి, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని కోరారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్



వీరఘట్టంలో ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న కేంద్ర సాయుధ బలగాలు

వీరఘట్టం: మండలంలోని పలు సమస్యాత్మక ప్రాంతాల్లో స్థానిక పోలీసులు, కేంద్ర బలగాలు గురువారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. ఎస్సై ఫకృద్దీన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సీబీఎం వీధి, కూరాకుల వీధి, గాసీ వీధి, కొండ వీధి, సెగిడి వీధి, బార్నాలవీధులతో పాటు ఎం.రాజపురంలో కవాతు నిర్వహించారు. ప్రశాంత పోలింగ్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్సై కోరారు.

ఏపీఓటీఏ కార్యవర్గం ఎన్నిక



ప్రతిజ్ఞ చేస్తున్న కార్యవర్గ సభ్యులు

భామిని: ఏపీ ఒడియా టీచర్ల సంఘం (ఏపీఓటీఏ) మండల కమిటీని బత్తిలి జెడ్పీ హైస్కూల్‌లో గురువారం ఎన్నుకున్నారు. ఏపీఓటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బృందావన దల్లై ఆధ్వర్యంలో ఎస్.రవికుమార్ పరిశీలనలో ఎన్నిక జరిగింది. మండల అధ్యక్షులుగా ఎస్.సుశీల, ఉపాధ్యక్షుడిగా కె.రాము, కార్యదర్శిగా కె.రాజశేఖర్, కోశాధికారిగా ఎస్.సుశాంత్, మరికొంత మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులు ప్రతిజ్ఞ చేశారు.

తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న తూనికలు, కొలతల శాఖ అధికారులు

పాలకొండ: తూనికలు, కొలతల శాఖాధికారులు గురువారం పట్టణంలో తనిఖీలు నిర్వహించారు. తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ విశ్వేశ్వరరావు (శ్రీకాకుళం) ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి పదిమంది దుకాణదారులపై కేసులు నమోదు చేశారు. ఆయన మాట్లాడుతూ, తూనిక యంత్రాలకు సీళ్లు వేయకపోతే చర్యలు తప్పవన్నారు.

సొంతింటి కల సాకారం..

- పక్కా గూడు పేదవాడి ఆత్మగౌరవానికి నిదర్శనం
- కాలనీల్లో శరవేగంగా నిర్మాణాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



జగనన్న కాలనీలో పూర్తయిన గృహాలు

పాలకొండ రూరల్: సొంతిల్లు పేదవాడి ఆత్మగౌరవానికి నిదర్శనం. అర్హుల సొంతింటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో ఎవరు ఎన్ని అడ్డంకులు కల్పించినా వాటిని అధిగమిస్తూ అర్హత గల లబ్ధిదారులకు బాసటగా నిలిచింది. పాలకొండ నగర పంచాయతీ పరిధికి సంబంధించి మండలంలోని లుంబూరు గ్రామానికి వెళ్లే రహదారికి ఇరువైపులా 33.20 ఎకరాలను సేకరించి.. 1242 మంది లబ్ధిదారులకు పట్టాలు అందించారు. స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం మూడేళ్ల కిందట జరిగింది. లబ్ధిపొందిన వారు ఓ శుభముహూర్తంలో గృహ నిర్మాణాలకు సంబంధించి సామూహిక శంకుస్థాపనలు చేపట్టారు. ఈ దశలో ప్రతిపక్షాలు నానాయాగీ చేయడంతో పాటు న్యాయస్థానాలను ఆశ్రయించి నిర్మాణ పనులకు మోకాలొడ్డిన విషయం విధితమే. కాలక్రమంలో ఈ అడ్డంకులు తొలగిపోవడంతో లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టడంలో నిమగ్నమయ్యారు. ఓవైపు అధికారుల సహకారం, ప్రభుత్వం నుంచి ఆర్థిక తోడ్పాటు లభిస్తుండడంతో కాలనీలో నిర్మాణాలు వేగవంతమయ్యాయి. ప్రస్తుతం పెద్ద ఎత్తున గృహ ప్రవేశాలు జరుగుతుండడం విశేషం. గతంలో అందించిన ఇళ్ల పట్టాలపై అక్కచెల్లెమ్మకు శాశ్వత హక్కును కల్పిస్తూ ఉచిత రిజిస్ట్రేషన్లు పూర్తి చేయించిన ప్రభుత్వం ఆ పట్టాలను అర్హులకు అందించింది.

సర్కారు తోడ్పాటు ఇలా.....

ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టిన ఒక్కో లబ్ధిదారునికి 90 బస్తాల సిమెంట్‌ను రాయితీ ధరకు అందిస్తున్నారు. అలాగే నిర్మాణ స్థాయికి అనుగుణంగా సిమెంట్, ఇనుము సమకూర్చేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకున్నారు. 485 కిలోల ఇనుము లబ్ధిదారులకు సమకూర్చుతున్నారు. ఇదే క్రమంలో లబ్ధిదారులకు ఇక్కట్లు కలగకుండా సకాలంలో బిల్లులు చెల్లించేలా చొరవచూపుతున్నారు. దీంతో నిర్మాణ లక్ష్యాలు మరింత త్వరితగతిన చేరుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. బేస్‌మెంట్ స్థాయిలో 40 బస్తాల సిమెంట్‌తో పాటు 343 కేజీల స్టీల్ అందిస్తున్నారు. బేస్‌మెంట్ నుంచి రూఫ్ స్థాయిలో 20 బస్తాల సిమెంట్, రూఫ్ లెవిల్ నుంచి ఆర్‌సీ స్థాయిలో 20 బస్తాల సిమెంట్, 142 కేజీల స్టీల్, శ్లాబ్ అనంతరం ప్లాస్టింగ్ కోసం 20 బస్తాల సిమెంట్‌ను సమకూరుస్తున్నారు. దీంతో పాటు ద్వారాలు, విద్యుత్ సంబంధిత ఇతర సామాగ్రి కూడా అందిస్తున్నారు. మొత్తంగా వివిధ దశల్లో లక్షా ఎనభై వేల రూపాయల ఆర్థిక సాయం ప్రభుత్వం నుంచి అందిస్తున్నారు. ఇదిలా ఉంటే అక్కచెల్లెమ్మలు నిర్మాణ దశలో ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా మెప్మా పరిధిలో గల 823 మంది ఎస్‌హెచ్‌సీ సభ్యులకు రూ.35 వేల వంతున తక్కువ వడ్డీకి రుణం కూడా అందించారు.

వివిధ దశల్లో...

కాలనీలో 1242 మందికి ఇంటి స్థలాలు అందించారు. ఇందులో 273 ఇళ్లు పూర్తవ్వగా... పునాది స్థాయిలో 633.. శ్లాబ్ లెవిల్‌లో 83... ప్లాస్టింగ్‌లు చేసే స్థాయిలో 27 ఇళ్లు ఉన్నాయి. ఇప్పటివరకు నిర్మాణ సామగ్రి రూపంలో రూ.2 కోట్ల 34 లక్షలు అర్హులకు అందించారు. బిల్లుల రూపంలో రూ.9 కోట్ల 2 లక్షల పైచిలుకు నిధులు లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు జమచేశారు.

మౌలిక సదుపాయాల కల్పన...

కాలనీలో ప్రజల అవసరాల మేరకు రూ.66 లక్షల ఖర్చుతో తాత్కాలిక గ్రావెల్ రహదారులు వేశారు. గృహ నిర్మాణ సమయంలో నీటి అవసరాలకు రూ.80 లక్షల ఖర్చుతో సంపులు నిర్మించి తద్వారా నీటిని అందిస్తున్నారు. ప్రజల శాశ్వత తాగునీటి అవసరాలు తీర్చేందుకు రూ.2.50 కోట్లతో 250 కిలోలీటర్ల సామర్థ్యం గల రక్షిత పథకం నిర్మిస్తున్నారు. అలాగే 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ రూ.3 కోట్ల వ్యయంతో చేపట్టారు.

మాటల్లో చెప్పలేని ఆనందం



నా భర్త బంగారునాయుడు భవన నిర్మాణ కార్మికునిగా ఎందరికో ఇళ్లు నిర్మించారు. మా కుటుంబానికి సొంత గృహం లేక అద్దె ఇంట్లో ఏళ్ల తరబడి ఇబ్బందులు పడ్డాం. ఎట్టకేలకు జగనన్న ప్రభుత్వ హయాంలో ఇల్లు మంజూరు కావడంతో నిర్మించుకున్నాం. ప్రస్తుతం సొంతింటిలో హాయిగా ఉంటున్నాం. – మీసాల వనజాక్షి, లబ్ధిదారు, జగనన్న కాలనీ, పాలకొండ

కల నెరవేరింది..



నా చిరకాల వాంఛ నెరవేరింది.వృత్తిరీత్యా నేను కారు నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాను. నాకు భార్య ఫాతిమాతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పని ఉంటేనే చేతిలో సొమ్ము. లేకుంటే అవస్థలే. సొంతిల్లు లేక ఇబ్బంది పడ్డాను. జగనన్న ప్రభుత్వంలో మా సొంతింటి కల సాకారమైంది. – షేక్ అబ్దుల్ జబ్బార్, లబ్ధిదారు, జగనన్న కాలనీ, పాలకొండ



కాలనీలో ఏర్పాటైన గ్రావెల్ రహదారి, విద్యుత్ స్తంభాలు, వీధిలైట్లు



నూతనంగా రూపుదిద్దుకుంటున్న విద్యుత్ సబ్ స్టేషన్

శతశాతం వసూలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సూర్యనారాయణ

గరుగుబిల్లి: ఇంటి పన్నులను శతశాతం వసూలు చేయాలని ఎంపీడీవో పి.సూర్యనారాయణ ఆదేశించారు. ఇదే విషయమై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమావేశమైన ఆయన ఇంటి పన్నుల వసూల లక్ష్యం చేరుకునేందుకు అవసరమైన ప్రణాళికలు చేయాలన్నారు. పంచాయతీలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమాళిని తప్పనిసరిగా పాటించాలన్నారు. ఎన్నికల కోడ్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, గ్రంథాలయ సెస్(పన్ను)ను గ్రంథాలయాల్లో జమ చేయాలని కోరుతూ ఎంపీడీవోకు లైబ్రేరియన్ ఎస్.మధుసూదనరావు వినతిపత్రం అందించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదేశాల మేరకు గ్రంథాలయానికి 8 శాతం మేర నిధులు అందించాలని అభ్యర్థించారు.

దంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ర్యాలీలో వైద్యులు, వైద్యారోగ్య సిబ్బంది

కురుపాం: ప్రతీ మనిషి తమ నోటి దంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం దంత వైద్యాధికారి సుక్రత సూచించారు. వరల్డ్ ఓరల్ హెల్త్ డే సందర్భంగా స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి సంత వరకు గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. జ్ఞానేంద్రియాల్లో ముఖ్య భాగమైన నోరు, నోటి దంతాలను చాలా ఆరోగ్యంగా, శుభ్రంగా ఉంచుకోవాలని లేకపోతే దంతాల చిగుళ్ల పగుళ్ల వల్ల బ్యాక్టీరియా నోటిలోకి చేరి, అనేక రకాలైన వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ శోభారాణి, వైద్యాధికారులు సునీల్, ఆశా కృష్ణ, వైద్యారోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు..



బీఎల్ఓలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

వీరఘట్టం: ప్రతీ పోలింగ్ కేంద్రంలో మౌలిక వసతులుండేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఎంవీబీ సుబ్రహ్మణ్యం సూచించారు. మండలంలోని కత్తులకవిటిలో గల పోలింగ్ కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎంత మంది ఓటర్లుఉన్నారు.. గతంలో జరిగిన పోలింగ్ తీరు..తదితర అంశాలపై ఆరా తీశారు. బీఎల్‌ఓలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

చెక్‌పోస్టుల ఏర్పాటు

- డీఎస్పీ కృష్ణారావు



మంగళాపురం వద్ద వాహన తనిఖీలు చేపడుతున్న డీఎస్పీ, సీఐ, ఎస్సై, తదితరులు

పాలకొండ రూరల్: ఎన్నికల నియమావళిలో భాగంగా జిల్లా పోలీస్ అధికారి విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు రెండు అంతర్రాష్ట్ర, నాలుగు అంతర్ జిల్లాల పోలీస్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ జీవీ కృష్ణారావు తెలిపారు. పాలకొండ – శ్రీకాకుళం రహదారిలో గాయత్రీ మంత్రాలయం వద్ద.. పాలకొండ – రాజాం రహదారిలో మంగళాపురం వద్ద గురువారం ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఆయా చెక్‌పోస్టులను తనిఖీ చేసిన డీఎస్పీ వాహనాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, చెక్‌పోస్టుల వద్ద సాయుధ బలగాలు, సివిల్ పోలీసులు నిరంతరం తనిఖీలు చేపడతారన్నారు. ఎవరైనా నగదు, బంగారం తరలిస్తే తగిన ఆధారాలు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సీఐ మీసాల చంద్రమౌళి, ఎస్సై ఎస్.ప్రశాంత్‌కుమార్, రిజర్వ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

- విస్తృత తనిఖీలు..



సీతంపేట: ఒడిశా ఆర్టీసీ బస్సులో తనిఖీలు చేపడుతున్న పోలీసులు

సీతంపేట: ఎన్నికల కోడ్ నేపథ్యంలో స్థానిక అడ్వంచర్ పార్కు వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బందితో పాటు స్థానిక పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఎవరైనా నగదు, మద్యం తరలిస్తున్నదీ, లేనిదీ పరిశీలించారు. ఎవరైనా డబ్బులు తీసుకెళ్లాల్సి వస్తే ఆధారం చూపాల్సి ఉంటుందని సిబ్బంది తెలిపారు.

పక్కాగా ఎన్నికల నియమావళి..

పాలకొండ:

ఎన్నికల నియమావళి పక్కాగా అమలు చేయాలని నగర పంచాయతీ కమిషనర్ ఎస్. సర్వేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని పలు వార్డుల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. రాజకీయ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని తెలిపారు. రాజకీయ నాయకుల ఫొటోలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు ఉంటే తొలగించాలని సూచించారు.



పాలకొండ: సిబ్బందికి సూచనలు అందిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

అప్రమత్తంగా ఉండాలి..

పాలకొండ: గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. మండలంలోని తుమరాడ గ్రామాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ సిబ్బందికి సూచనలు అందించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదని సూచించారు. గ్రామాల్లో పర్యటించి పార్టీల జెండాలు, బ్యానర్లు ఉంటే తొలగించాలన్నారు.

వివాదాలకు పోవద్దు..

భామిని: ఎన్నికల వేళ ఎవ్వరూ వివాదాల జోలికి పోవద్దని బత్తిలి ఎస్సై చిట్టిపోలు ప్రసాద్ అన్నారు. మండలంలోని లోహరిజోల, వడ్డంగి, గురండి గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని కోరారు. పాత కక్షలతో వివాదాలు పెంచుకోవద్దని సూచించారు. పాత కేసుల్లో ఉన్న నిందుతులు విధిగా స్టేషన్‌కు వచ్చి బైండోవర్ కావాలన్నారు. అనంతరం ఏబీ రోడ్డుపై వాహన తనిఖీలు చేశారు.

అవగాహన తప్పనిసరి

పాలకొండ రూరల్: అకాల వర్షాల కారణంగా మామిడి తోటల్లో ఏర్పడే నష్ట నివారణపై సంబంధిత రైతులు అవగాహన కలిగి ఉండాలని ఉద్యానవన శాఖాధికారి టి. అమరేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం కాయ దశకు చేరుకున్న తోటల్లో నిటి నిల్వలు లేకుండా చూడాలని పేర్కొన్నారు. పండు ఈగ ఆశించే తోటల్లో లీటర్ నీటిలో రెండు ఎం.ఎల్ మిథైల్ యుజినాల్, 3 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు, రెండు ఎం.ఎల్ మలాథియాన్ కలిపి ద్రావణం తయారుచేసుకోవాలని సూచించారు. ఈ ద్రావణాన్ని ప్లాస్టిక పళ్లాల్లో 250 ఎం.ఎల్ చొప్పున పోసి ఎకరా పొలంలో నాలుగు చోట్ల ఉంచాలన్నారు. దీనివల్ల పండు ఈగ బెడద ఉండదని తెలిపారు.

మాతా,శిశు మరణాల నివారణకు కృషి



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

జియ్యమ్మవలస: మాతా,శిశు మరణాల నివారణకు కృషి చేయాలని ఎంపీడీవో శ్రీనివాసరావు వైద్యులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైద్యాధికారులు, వైద్యారోగ్య సిబ్బందితో గురువారం సమావేశమైన ఆయన గర్భం దాల్చినప్పటి నుంచి ఏడాది వయసు వచ్చేంత వరకు బిడ్డ ఆరోగ్యం చూసే బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. నెలవారీ చేయాల్సిన వైద్య తనిఖీలు సక్రమంగా చేయాలని, అవసరమైన మందులు పక్కాగా వేసేలా సూచనలు చేయాలని తెలిపారు. రక్తహీనత, బరువు, ఎత్తు ఎప్పటిప్పుడు పరిశీలిస్తూ సంపూర్ణ ఆరోగ్యానికి సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. డాక్టర్ శంకర్ మాట్లాడుతూ గతంలో కన్నా ఇప్పుడు మాతా, శిశు మరణాలు బాగా తగ్గాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం సరఫరా చేసే పౌష్టికాహారంపై కూడా అవగాహన కల్పించాలన్నారు. లబ్ధిదారులే ఆ పౌష్టికాహారం తినేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జగదీష్, ఐసీడీఎస్ పీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై దృష్టి

జియ్యమ్మవలస: పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై దృష్టిసారించాలని తహసీల్దార్ కె.వి.సీతారామయ్య సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వో(బూత్ లెవల్ ఆఫీసర్)లతో గురువారం సమావేశమైన ఆయన అన్ని పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ర్యాంప్, ఫర్నిచర్ వంటి మౌలిక వసతులు ఉన్నవీ లేనివీ పరిశీలించాలన్నారు. ప్రతీ కేంద్రంలో ఆయా సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. ఎక్కడైనా లేకపోతే తమ దృష్టికి తీసుకురాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పకీరు పాల్గొన్నారు.



బీఎల్‌వోలకు సూచనలిస్తున్న తహసీల్దార్ సీతారామయ్య

సికిల్‌సెల్ ఎనీమియాపై అప్రమత్తం



మాట్లాడుతున్న డాక్టర్ దామోదరరావు

భామిని: సికిల్‌సెల్ ఎనీమియాపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని బత్తిలి పీహెచ్‌సీ వైద్యాధికారి దామోదరరావు అన్నారు. మండలంలోని మనుమకొండలో సికిల్‌సెల్ ఎనీమియాపై (రక్తహీనత) గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ నిమ్మల కేశవ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ దామోదరరావు మాట్లాడుతూ, రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎస్. గంగారావు, వైద్యసిబ్బంది, గిరిజనులు పాల్గొన్నారు.

ప్రిజమ్-10పై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీవో సూర్యనారాయణ

గరుగుబిల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ప్రిజమ్-10(పదేళ్లలోపు పిల్లల్లో మరణాల రేటు నివారణ/ప్రాజెక్ట్ ఫర్ రిడక్షన్ ఆఫ్ ఇన్ఫాంట్ మోర్టాలిటీ రేట్ బిలో-10)పై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పి.సూర్యనారాయణ మాట్లాడుతూ రక్తహీనత నివారణపై అవగాహన కలిగి ఉండేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రక్తహీనత బారినపడిన వారిని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వయసుకు తగ్గ బరువు, రక్తహీనత కలిగిన వారి వివరాలు సేకరించి, వారి ఆరోగ్యం మెరుగును పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు కె.కె.సాగర్‌వర్మ, డాక్టర్ కె.కార్తీక్, వెలుగు ఏపీఎం పి.అప్పలనాయుడు, ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా ‘ప్రిజమ్-10’

- ఎంపీడీఓ రామకృష్ణ



సమీక్షలో సూచనలు చేస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

పాలకొండ రూరల్: ప్రిజం-10 కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఎంపీడీఓ ఎస్. రామకృష్ణ స్పష్టం చేశారు. గురువారం తన కార్యాలయంలో వైద్యారోగ్యశాఖ, ఐసీడీఎస్, సచివాలయ, వెలుగు సిబ్బంది అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నవరం, ఎం.సింగుపురం పీహెచ్‌సీల పరిధిలోని సచివాలయాల వారీగా సమీక్ష చేపట్టారు. గిరిజన ఆవాస ప్రాంతాలు అధికంగా ఉన్న నేపథ్యంలో ఆరోగ్య పరిరక్షణపై జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా రక్తహీనతను అధిగమించేందుకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీసారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, కౌమార బాలికల్లో రక్తహీనత సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. రానున్న ఆదివారం కేంద్రం నుంచి ఇద్దరు సభ్యులతో కూడిన కమిటీ జిల్లాలో, మండలాల్లో పర్యటించనుందన్నారు. అధికారులు సమన్వంతో వ్యవహరించి ఉత్తమ ఫలితాలు సాధించి.. కేంద్ర కమిటీ పరిశీలనలో మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. సమావేశంలో వైద్యాధికారులు వి.కమల్‌నాథ్, శివశంకర్, ఈఓపీఆర్డీ కె.సూర్యనారాయణ, ఏపీఎం సూరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



కారు డిక్కీలో తనిఖీలు చేస్తున్న తహసీల్దార్ రమేష్‌కుమార్, పోలీసులు

కొమరాడ: ఎన్నికల నేపథ్యంలో వాహన తనిఖీలను పోలీసులు ముమ్మరం చేశారు. మండల పరిధిలో అంతర్‌రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన కూనేరు చెక్‌పోస్ట్ వద్ద తహసీల్దార్ ఆర్.రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. ఎన్నికల దృష్ట్యా డబ్బు, మద్యం రవాణా జరగకుండా ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో పటిష్ట నిఘా పెట్టామన్నారు. ప్రతిఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలని, ఎక్కడైనా రాజకీయ ప్రచార చిత్రాలు, పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగ్‌లు ఉంటే వాటిని వెంటనే తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసరావు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జైగురుదత్త హోమం



హోమం చేస్తున్న భక్తులు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో జై గురుదత్త హోమం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, కాకడహారతి, విశేషార్చనలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టాం ప్రాంతానికి చెందిన ప్రముఖ యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎస్.శర్మయాజీ సహకారంతో అర్చకులు ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో హోమం, పూజలు చేశారు. మండల కేంద్రంలోని భక్తులతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ హోమం చేయడం ద్వారా అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని అర్చకులు తెలిపారు. మధ్యాహ్నం దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేశారు.

శాఖాపరంగా అండగా ఉంటాం..

పాలకొండ రూరల్: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హెచ్‌సీగా విధులు నిర్వహిస్తున్న ఎస్.ఆనప (42) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. దీంతో ఎస్పీ విక్రాంత్ పాటిల్ తక్షణ సాయం కింద రూ. 25 వేలను మృతుడి భార్య లక్ష్మికి అందజేశారు. అలాగే శాఖాపరంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మృతుడి స్వగ్రామమైన సీతంపేట మండలం కుడ్డపల్లిలో అంత్యక్రియలు జరిగాయి. డీఎస్పీ జీవీ కృష్ణారావు, సీఐ ఎం.చంద్రమౌళి, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్సైలు, సహచర సిబ్బంది పాల్గొని ఆనప కుటుంబ సభ్యులను పరామర్శించారు.